క్లుప్తంగా

కొండగట్టుకు హనుమాన్ మాలధారుల పాదయాత్ర



సంగెం : మండలంలోని కుంటపల్లికి చెందిన హనుమాన్ మాలధారులు ఇరుముడి కట్టుకుని జగిత్యాల జిల్లాలోని కొండగట్టుకు పాదయాత్రగా ఆదివారం బయల్దేరారు. తొలుత కుంటపల్లిలోని శ్రీరామలింగేశ్వరాలయంలో హోమం నిర్వహించారు. అనంతరం ఇరుముడి ధారణ చేసుకుని పాదయాత్ర చేపట్టారు. హనుమాన్ జయంతి రోజున మాలవిరమణ చేయనున్నారు. పాదయాత్ర చేపట్టిన వారిలో హనుమాన్ మాలధారులు గుండాల రాజేందర్, బోయిన రాకేశ్, పాశం రాజు, సూరయ్య, కడమంచి రవి, కొప్పుల రాజేశ్, గోపతి విష్ణు, ఎనబోతుల రాజు, గోపతి యుగేందర్, కాట్రపల్లి సాంబయ్య, జక్క బన్నీ తదితరులున్నారు.

యువకుడిపై కేసు

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు చెందిన వడ్లకొండ శివపై దాడి చేసిన జనగాం క్రాంతిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై సీతారాం తెలిపారు. వివరాలిలా.. శివ స్నేహితులు కంది భరత్, జగదీశ్, శాబోత్ గణేశ్, కడారి రాకేశ్, అనుమాండ్ల రాకేశ్‌లతో కలిసి మాట్లాడుతుండగా ఈనెల 16న కాంత్రి దాడి చేశాడు. అనంతరం శివ ఇంటికి వెళ్లాక మళ్లీ అక్కడకు క్రాంతి వెళ్లి చేతికి ఉన్న కడియంతో దాడి చేయగా శివ పడిపోయాడు. శివను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించిన అనంతరం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కట్ట శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదివారం పరామర్శించారు. తొలుత శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, మాజీ ఎంపీటీసీ అత్తి రేవతి కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు బుద్దె పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.


చింతనెక్కొండలో..

మండలంలోని చింతనెక్కొండకు చెందిన బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జీడి శ్రీనివాస్ ఇటీవల మృతి బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు అక్కల రాజును అతడి తండ్రి సూరయ్య ఇటీవల మృతి చెందిన క్రమంలో పరామర్శించారు. పార్టీ కుటుంబాలకు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్, వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరెపల్లిలో..

గీసుకొండ : మండలంలోని ఆరెపల్లెలో లకిడె మధురాబాయి, నాగుర్ల బక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. తొలుత మధురాబాయి, బక్కయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు బోడకుంట్ల ప్రకాశ్, రఘుపతిరెడ్డి, సిందె విజయ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



సంగెం : మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన అల్లం భాస్కర్‌రెడ్డి (56) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. భాస్కర్‌రెడ్డి మృతి బాధాకరమని చెప్పారు.

నేడు ఎమ్మెల్యే రాక

రాయపర్తి : నేడు మండలానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి రానున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జగన్నాధపల్లిలో తలపెట్టిన సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన, భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ఉంటుందని వివరించారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గతం ఆదర్శం.. వర్తమానం తిరోగమనం..

- రుణ చెల్లింపులో వెనుకబడుతున్న మహిళా సంఘాల సభ్యులు



మహిళా సంఘాల సభ్యులతో సమీక్షిస్తున్న ఏపీఎం రాజ్‌కుమార్ (ఫైల్)

దుగ్గొండి : గతం ఆదర్శం.. వర్తమానం తిరోగమనం.. భవిష్యత్ పరిస్థితి ఏంటి..? అంటూ పలువురు మహిళా సంఘాల సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. గత ఆర్థిక సంవత్సరం లింకేజీ రుణాలు తీసుకోవడం, సకాలంలో చెల్లించడం, స్త్రీనిధి రుణాలు.. చెల్లింపుల్లో నూరు శాతం ఫలితం సాధించి ఆదర్శంగా నిలిచిన మహిళా సంఘాలు ఈ ఏడాది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 63.46 శాతం రుణాలు పొంది తిరోగమన దిశలో పయనిస్తున్నట్టు వ్యాఖ్యలు వినవస్తున్నాయి.

మండలంలో 70 మంది మహిళా సంఘాలు మొదలయ్యాయి. మొత్తం 34 గ్రామ పంచాయతీల పరిధిలో 43 గ్రామైఖ్య, 1130 స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు కాగా 11 వేల 757 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కో సభ్యురాలు వేల రూపాయల అప్పు నుంచి మొదలుకొని ప్రస్తుతం లక్షల్లో తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. బ్యాంకులు మహిళలకు తనఖా లేకుండానే లక్షలాది రూపాయల రుణాలిస్తూ ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే.

సంఘాల పనితీరు

పంచ సూత్రాలు పాటించడం, ఆర్థిక ప్రగతి, స్వయం ఉపాధి, జెండర్ సమస్యల పరిష్కారం తదితర కార్యక్రమాల్లో సంవత్సరాలుగా జిల్లాలో మండలం మొదటి, రెండో స్థానాల్లో నిలిచి ఆదర్శ మండలంగా గుర్తింపు సాధించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో లింకేజీ రుణాలు తీసుకోవడం, సకాలంలో చెల్లించడం, స్త్రీనిధి అప్పులు.. చెల్లింపులో 100 శాతం ఫలితం సాధించి ముందంజలో నిలిచింది. 2024–25 ఆర్థిక సంవత్సరం మండల పరిధిలోని 972 సంఘాలకు రూ.53.38 కోట్ల రుణాలివ్వాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా కేవలం 489 సంఘాలు మాత్రమే అర్హత కలిగి రూ.33.88 కోట్లు పొందాయి. జిల్లాలో మొదటి, రెండో స్థానంలో నిలిచి అభినందనలు సాధించిన మండల మహిళా సంఘాల్లో కొన్ని ప్రస్తుతం చెల్లింపుల్లో వెనకబడిపోయాయి. జిల్లావ్యాప్తంగా అప్పులు తీసుకుని సకాలంలో చెల్లించని సంఘాలు 291 కాగా అందులో మండలం నుంచి 104 సంఘాలుండడం గమనార్హం. వెనుకబాటులో మండలం ఫస్ట్ అన్న వ్యాఖ్యలు వినవస్తుండడంతో పలువురు మహిళా సంఘాల సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు

సభ్యులకు అవగాహన కల్పించడం, సంఘాలు ప్రతినెలా సమావేశాల నిర్వహణ, జమ–ఖర్చుల వివరాల పరిశీలన, బ్యాంకుల్లో చెల్లింపులు సమీక్షించని కారణంగా కొన్ని సంఘాల అప్పు బకాయిలు పేరుకుపోతున్నాయని తెలుస్తోంది. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సంఘాల పనితీరును సమీక్షించాలని, తిరోగమనం నుంచి పురోగమన దిశగా నడిపించాలని సభ్యులు కోరుతున్నారు.

> **బకాయిలు లేని మండలంగా తీర్చిదిద్దుతాం**
>
> 
>
> గ్రామాల వారీగా బకాయి ఉన్న సంఘాలను గుర్తించాం. కొందరు సభ్యులు సకాలంలో చెల్లించడం లేదు. సంఘాల నుంచి వసూళ్ల కోసం ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేశాం. బకాయి ఉన్న సభ్యులను కలిసి అవగాహన కల్పిస్తూ వసూళ్లకు యత్నిస్తున్నాం. త్వరలో బకాయిలు లేని మండలంగా తీర్చిదిద్దుతాం.
>
> – గుజ్జుల రాజ్‌కుమార్, ఏపీఎం

తిరంగా ర్యాలీని జయప్రదం చేయండి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : నేడు (సోమవారం) జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించతలపెట్టిన తిరంగ ర్యాలీను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూనె అనిల్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి శ్రీనివాస్‌రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. ఉగ్రవాదుల పాశవిక దాడికి ప్రధాని మోదీ నాయకత్వంలోని భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో తగిన రీతిలో గుణపాఠం చెప్పిందన్నారు. సైన్యానికి మద్దతుగా తలపెట్టిన తిరంగ ర్యాలీలో మండలంలోని అన్ని వర్గాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి వడ్లకొండ రవి, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘వాకర్స్’ ప్రధాన కార్యదర్శిగా సదానందం



సదానందంను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

నర్సంపేట : స్థానిక వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఆడెపు సదానందం నియమితులయ్యాడు. ఈ సందర్భంగా మినీ స్టేడియంలో అసోసియేషన్ బాధ్యులు శాలువాతో ఆయన్ను సన్మానించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 303 గవర్నర్ ఎలెక్ట్, నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. సదానందం 2019 నుంచి అసోసియేషన్ సభ్యుడిగా, ఉపాధ్యక్షుడిగా సేవలు అందిస్తున్న క్రమంలో ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాలకుర్తి శ్రీనివాస్, పుల్లూరి స్వామిగౌడ్, బాల్నె జగన్, కోశాధికారి సంకినేని కృష్ణ, కార్యవర్గ సభ్యులు అహ్మద్‌భాషా, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు ప్రాణసంకటం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రైతులతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

పర్వతగిరి : ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం రైతులకు ప్రాణసంకటంగా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆందోళన వెలిబుచ్చారు. మండలంలోని చింతనెక్కొండ, కొంకపాక గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడారు. రైతులు ధాన్యం విక్రయించేందుకు రోజుల తరబడి ఎదురు చూస్తున్న దయనీయ స్థితి నెలకొందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం లోపభూయిష్ట విధానాల కారణంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుంచి మొదలుకొని మిల్లర్ల వరకు రైతులను ఇష్టారీతిన దోచుకుంటున్న స్థితి కనపడుతోందని చెప్పారు. సాగునీరు సరఫరాలో, ధాన్యం కొనుగోళ్లలో, బోనస్ అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈదురు గాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా బతుకుతుండగా ప్రభుత్వం మొద్దు నిద్రలో జోగుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయని చెప్పారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు, అన్ని వర్గాల ప్రజలు గుణపాఠం చెప్పనున్నారని జోస్యం చెప్పారు. వెంటనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం మొత్తాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం రైతుల సమస్యలను ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్, వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్‌రావు, ఎంపీటీసీ కరిమిళ్ల మోహన్‌రావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గంధం బాలరాజు, చింతనెక్కొండ మాజీ ఉపసర్పంచ్ దర్నోజు దేవేందర్, నాయకులు జీడి గట్టయ్య, మౌనిక రాజు, సుభాషిణి వాసు, దబ్బెట నరేశ్, యాలాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పొదుపుతో బంగారు భవిష్యత్‌కు బాటలు

- పొదుపు సమితి అధ్యక్షుడు కుమారస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నర్సంపేట : ఆదాయం నుంచి కొంత పొదుపు చేసుకోవడాన్ని అలవర్చుకుంటే బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని భారతీయ పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు నూనె కుమారస్వామి తెలిపారు. చెన్నారావుపేట మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శ్రమశక్తి పురుషుల పొదుపు సంఘం రజతోత్సవ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు కుమారస్వామి అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం 2000 సంవత్సరంలో 175 మందితో ఏర్పడి 25 ఏళ్లలో 648 మంది సభ్యులతో రూ.1.30 కోట్ల నిధులతో ముందుకు సాగుతుండడం అభినందనీయమని తెలిపారు. సంఘం అభివృద్ధికి పాలకవర్గం, సభ్యులు చొరవ చూపాలని సూచించారు. రజతోత్సవ నివేదికను ప్రవేశ పెట్టగా ఆమోదించారు. అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూత్రపు సుధాకర్, ఉపాధ్యక్షుడుగా దొంతి సాయిలు ఎన్నికయ్యారు. సభలో సంఘం అధ్యక్షుడు సూత్రపు సుధాకర్, ఉపాధ్యక్షుడు దొంతి సాయిలు, పాలకవర్గ సభ్యులు గట్ల రాంబాబు, పులి రమేశ్, బెట్టబోయిన వీరభద్రయ్య, శంకేసి రంజిత్‌కుమార్, మెంతుల రమేశ్, సూర రంజిత్, తౌటి రవి, సిద్ద కుమారస్వామి, వ్యవస్థాపక పాలకవర్గ సభ్యులు కంది చిన్న మల్లారెడ్డి, కూతురు ఇంద్రారెడ్డి, పత్తి అనంతరెడ్డి, దొనికెల వీరయ్య, వెంకటేశ్వర్లు, తాళ్లపెల్లి కొమ్మాలు, ముత్యం సాంబయ్య, సమితి కోశాధికారి రవీందర్‌రెడ్డి, సంఘం కోశాధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పదో తరగతిలో బోధించిన ఉపాధ్యాయుడితో పూర్వవిద్యార్థులు

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో 2000–01 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న నేపథ్యంలో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంలో మునిగి తేలారు. స్నేహం కొనసాగించాలని, వీలైతే సామాజిక సేవలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులైన సద్గుణచారి, నరేంద్రలను సాదరంగా ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు గుండ్లపల్లి శ్రావణ్‌కుమార్, మొహమ్మద్ ఖతీజ, రాపాక రాజు, వెంకన్న, గుండ్లపల్లి సంతోశ్, కత్తి రమేశ్, సురేందర్, కవిత, కందుకూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోపణలు మానుకోవాలి’

కొత్తగూడ: కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల దుర్వినియోగంపై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు వాస్తవం కాదని చెప్పారు. ఎవరికి చెక్కు మంజూరైన వారి వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయని తెలిపారు. అలాంటి ఆధారాలతో నిరూపిస్తే తమ పార్టీ కార్యకర్తలు అయినా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. ఈ సమావేశంలో చల్ల నారాయణరెడ్డి, మొగిళి, రూప్‌సింగ్, గుమ్మడి సమ్మయ్య, ఈర్య, తదితరులు పాల్గొన్నారు.

‘వ్యర్థాలకు’ నిప్పు.. చెట్లకు ముప్పు

- అగ్నికి ఆహుతి అవుతున్న చెట్లు



గవిచర్ల వద్ద కాలిపోయిన చెట్లు

సంగెం : వేసవి కాలంలో కొందరు రైతులు పంట చేలల్లోని వ్యర్థాలకు నిప్పు పెడుతుండడంతో హరితహారంలో భాగంగా పెంచిన చెట్లకు ముప్పు వాటిల్లుతోంది. అన్ని గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి ఏటా లక్షలాది మొక్కలు నాటుతూ వాటి సంరక్షణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న విషయం తెలిసిందే. మొక్కల సంరక్షణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడిన క్రమంలో కొన్ని చోట్ల హరితహారం లక్ష్యం నెరవేరని దుస్థితి కనపడుతోంది. హరితహారంలో భాగంగా మండలంలోని ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగాయి. కొన్ని చోట్ల విద్యుత్ తీగలు తగులుతున్నాయన్న కారణంతో విద్యుత్ శాఖ అధికారులు తొలగింపజేస్తుండగా చెట్లు మోడువారి పోతున్నాయి. మండలంలోని కుంటపల్లి, సంగెం, తిమ్మాపూర్, పల్లారుగూడ, నల్లబెల్లి, మొండ్రాయి, గవిచర్ల, తీగరాజుపల్లి, కాట్రపల్లి, ఆశాలపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో కొందరు రైతులు పంట పొలాల్లోని మొక్కజొన్న, వరికొయ్యల వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. ఈ క్రమంలో గాలికి మంటలు అంటుకుని పంట పొలాలకు పక్కనే ఉన్న హరితహారం చెట్లు దగ్ధమవుతున్నాయి. ఏటా రోడ్ల వెంట ఉన్న హరితహారం చెట్లు అగ్గిపాలు అవుతుండడం పర్యావరణ ప్రేమికులను వేదనకు గురి చేస్తోంది.

అవగాహన కీలకం

పంట పొలాల్లోని వర్థాలకు నిప్పు పెడుతుండడంతో హరితహారం చెట్లు దగ్ధం కాకుండా రైతులకు అవగాహన కల్పించడం కీలకం. ఇకనైనా అధికారులు రైతులను చైతన్యవంతం చేయడంతోపాటు మొక్కల సంరక్షణ బాధ్యతలు వారికే అప్పగిస్తే మేలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. హరితహారంలో నాటిన చెట్లను అటవీ శాఖ అధికారులు పర్యవేక్షించడం లేదన్న అపవాదు ఉంది.

> **చెట్ల రక్షణకు చర్యలు చేపడతాం**
>
> హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా పెంచిన చెట్ల రక్షణకు చర్యలు చేపడతాం. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల కలిగే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పిస్తాం. మంటలు రోడ్ల పక్కన ఉండే చెట్లకు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
>
> –వాంకుదోత్ శ్రీను, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

ట్యాంకర్ ఢీకొని వృద్ధుడి మృతి




యాకయ్య (ఫైల్)

మామునూరు: సెప్టిక్ ట్యాంకర్ ఢీకొట్టడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం ఖిలా వరంగల్ మండలం అల్లీపురంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి కొత్తపెల్లి యాకయ్య (85) వ్యక్తిగత పనులపై రోడ్డుపైకి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సెప్టిక్ ట్యాంకర్ వెనుకకు తీస్తున్న సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యాకయ్యను ఢీకొట్టింది. దాంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు చక్రపాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

గంగారం : ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు అదుపుతప్పి జరిగిన ప్రమాదంతో యువకుడు గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన మండలంలోని మడగూడెం శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ మండలంలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన జాడి వేణుగోపాల్ (25) గంగారం మండలంలోని కోమట్లగూడెంలోని తన సోదరి మమత ఇంటికి సాయంత్రం వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మడగూడెం క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పి పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడి భార్య గర్భిణి. కుటుంబీకుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి.

పోచమ్మమైదాన్‌లో చలివేంద్రం ప్రారంభం



రామన్నపేట: నగరంలోని పోచమ్మమైదాన్ చౌరస్తాలో వాక్ ఫౌండేషన్ తరపున ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు చల్లని మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందించారు. 18 ఏళ్లుగా జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న వాక్ ఫౌండేషన్ ప్రతినిధులను వారు అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, వన్నాల శ్రీరాములు, మాజీ ఎంపీ సీతారాంనాయక్, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రదీప్‌రావు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రేణుల సంక్షేమానికి ప్రాధాన్యం



పార్టీలో చేరిన వారితో రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : బీజేపీ నాయకుల, కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. సీతారాంతండా, ఖానాపురం మండలంలోని నాజీతండాకు చెందిన పలువురు ఆ పార్టీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి రాణాప్రతాప్‌రెడ్డి అతిథిగా హాజరై పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీ, ప్రజల కోసం పని చేసే శ్రేణులకు సముచిత అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

క్రీడల్లో రాణించాలంటే సాధన కీలకం

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు : క్రీడల్లో రాణించాలంటే సాధనే కీలకంగా మారుతుందని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఐనవోలు క్రికెట్ ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. పట్టుదల ఉంటేనే ఏదైనా సాధించవచ్చన్నారు. ప్రతి రంగంలో గెలుపోటములు సహజమని వాటిని పట్టించుకోకుండా నిరంతరం సాధన చేసి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. క్రికెట్ పోటీల్లో 30 టీంలు పాల్గొనగా ప్రథమ బహుమతి ఐనవోలు రైజింగ్ స్టార్స్, ద్వితీయ బహుమతి ఐనవోలు యువసేన, తృతీయ బహుమతిగా ఖిలా వరంగల్ టీం నిలవగా ఆయన నగదు, షీల్డ్‌లను అందించారు. మాజీ సర్పంచ్ కుమారస్వామి, మండల నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్, కొత్తూరు సునీల్, రాజిరెడ్డి, నాయకులు పరమేశ్, కుమార్, భానుప్రసాద్, పులి శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.